# భావములోన

శుద్ధ ధన్యాసి రాగం : ఆదితాళం

సంగీతకర్త : శ్రీ నేదునూరి కృష్ణమూర్తి

ప ॥ భావములోనా బాహ్యము నందును
గోవింద గోవింద యని కొలువవో మనసా॥ ॥ భావము॥

చ॥ హరియవతారములే అఖిల దేవతలు
హరిలోనివే బ్రహ్మాండంబులు
హరి నామములే అన్ని మంత్రములు
హరి హరి హరి హరి హరి యనవో మనసా॥ ॥ భావము॥

చ॥ విష్ణుని మహిమలే విహిత కర్మములు
విష్ణుని పొగడెడి వేదంబులు
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు
విష్ణువు విష్ణువని వెదకవో మనసా॥ ॥ భావము॥

చ॥ అచ్యుతు డితడే ఆదియు నంత్యము
అచ్యుతుడే అసురాంతకుడు
అచ్యుతుడు శ్రీ వేంకటాద్రి మీద నిదె
అచ్యుత అచ్యుత శరణనవో మనసా॥ ॥ భావము॥

# బ్రహ్మ కడిగిన పాదము

ముఖారి రాగం : ఆదితాళం

సంగీతకర్త : శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ

ప ॥ బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మము తానె నీ పాదము॥ ॥ బ్రహ్మ ॥

చ॥ చెలగి వసుధ గొలిచిన నీ పాదము
బలితల మోపిన పాదము
తలకక గగనము తన్నిన పాదము
బలరిపు గాచిన పాదము॥ ॥ బ్రహ్మ ॥

చ॥ కామిని పాపము కడిగిన పాదము
పాము తలనిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపు పాదము॥ ॥ బ్రహ్మ ॥

చ॥ పరమ యోగులకు పరిపరి విధముల
పరమొసగెడి నీ పాదము
తిరు వేంకటగిరి తిరమని చూపిన
పరమ పదము నీ పాదము॥ ॥ బ్రహ్మ ॥

# ఎంత మాత్రమున

బృందావని, మాయామాళవగౌళ రాగమాలిక – మిశ్రచాపుతాళం

సంగీతకర్త : శ్రీ కడయనల్లూర్ వెంకట రామన్

ప ॥ ఎంత మాత్రమున ఎవ్వరు దలచిన అంత మాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడ పిండంతే నిప్పటి యన్నట్లు॥
॥ ఎంత ॥

చ॥ కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు
తలతురు మిము శైవులు తగిన భక్తులును శివుడనుచు
అలరి పొగడుదురు కాపాలికు లాదిభైరవుండనుచు॥ ॥ఎంత ॥

చ॥ సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరిశనములు మిము నానావిధులను తలపుల కొలదుల భజింతురు
సిరుల మిము నే యల్పబుద్ధి దలచిన వారికి అల్పంబవుదువు
గరిమల మిము నే ఘనమని దలచిన ఘన బుద్ధులకు ఘనుడవు
నీవలన కొరతే లేదు మరి నీరు కొలది తామెరవు
ఆవల భాగీరథి దరి బావుల ఆ జలమే ఊరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మము చేకొని వున్న దైవమని
ఈవల నే నీ శరణననెదను ఇదియే పర తత్త్వము నాకు॥ ॥ ఎంత ॥

# పొడగంటిమయ్య మిమ్ము

మోహన రాగం : ఆదితాళం

సంగీతకర్త : శ్రీ డి.పశుపతి

ప ॥ పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా మమ్ము
నెడయకవయ్య కోనేటిరాయడా॥ ॥ పొడగంటి ॥

చ॥ కోరి మమ్ము నేలినట్టి కులదైవమా! చాలా
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా! మాకు
చేరువ చిత్తములోని శ్రీనివాసుడా!॥ ॥ పొడగంటి ॥

చ॥ భావింప కైవసమైన పారిజాతమా! మమ్ము
చేవదేర గాచినట్టి చింతామణీ
కావించి కోరికలిచ్చే కామధేనువా! మమ్ము
తావై రక్షించేటి ధరణీధరా!॥ ॥ పొడగంటి ॥

చ॥ చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా! రోగా-
లడచి రక్షించే దివ్యౌషధమా!
బడిబాయక తిరిగే ప్రాణబంధుడా! మమ్ము
గడియించినట్టి శ్రీ వేంకటనాథుడా॥ ॥ పొడగంటి ॥

# కొండలలో నెలకొన్న

హిందోళ రాగం : ఆదితాళం

సంగీతకర్త : శ్రీ ఎం.ఎస్. బాలసుబ్రహ్మణ్య శర్మ

ప ॥ కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు
కొండలంత వరములు గుప్పెడువాడు॥ ॥కొండలలో॥

చ॥ కుమ్మర దాసుడైన కురువరత్తినంబి
ఇమ్మన్న వరములెల్ల ఇచ్చినవాడు
దొమ్ములు చేసినయట్టి తొండమాన్ జక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి నమ్మిన వాడు॥ ॥కొండలలో॥

చ॥ అచ్చప వేడుకతో అనంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్నుమోచిన వాడు
మచ్చిక దొలక తిరుమల నంబి తోడుత
ఇచ్చినిచ్చ మాటలాడి నచ్చిన వాడు॥ ॥కొండలలో॥

చ॥ కంచిలోన నుండ తిరుకచ్చి నంబి మీద కరు
ణించి తన యెడకు రప్పించిన వాడు
ఎంచనెక్కుడైన వేంకటేశుడు మనలకు
మంచివాడై కరుణ పాలించినవాడు॥ ॥కొండలలో॥

# నారాయణ తే నమోనమో

బెహాగ్ రాగం : ఆదితాళం

సంగీతకర్త : శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ

ప ॥ నారాయణతే నమో నమో
నారద సన్నుత నమో నమో॥ ॥నారాయణ॥

చ॥ మురహర భవహర ముకుంద మాధవ
గరుడగమన పంకజనాభ
పరమపురుష భవబంధ విమోచన
నరమృగ శరీర నమో నమో॥ ॥నారాయణ॥

చ॥ జలధిశయన రవిచంద్ర విలోచన
జలరుహాభవ నుత చరణయుగ
బలిబంధన గోపవధూ వల్లభ
నలినోదర తే నమో నమో॥ ॥నారాయణ॥

చ॥ ఆదిదేవ సకలాగమ పూజిత
యాదవకుల మోహన రూప
వేదోద్ధర తిరు వేంకట నాయక
నాదప్రియతే నమో నమో॥ ॥నారాయణ॥

# ముద్దుగారే యశోద

కురంజి రాగం : ఆదితాళం

సంగీతకర్త : శ్రీ నేదునూరి కృష్ణమూర్తి

ప ॥ ముద్దుగారే యశోద ముంగిటి ముత్తెము వీడు
తిద్దరాని మహిమల దేవకీ సుతుడు॥ ॥ ముద్దు ॥

చ॥ అంత నింత గొల్లెతల అరచేతి మాణికము
పంతమాడే కంసుని పాలి వజ్రము
కాంతుల మూడు లోకాల గరుడ పచ్చ పూస
చెంతల మాలోనున్న చిన్నికృష్ణుడు॥ ॥ ముద్దు ॥

చ॥ రతికేళి రుక్మిణికి రంగుమోవి పగడము
మితి గోవర్ధనపు గోమేధికము
సతమై శంఖచక్రాల సందుల వైడూర్యము
గతియై మమ్ము గాచే కమలాక్షుడు॥ ॥ ముద్దు ॥

చ॥ కాళింగుని తలలపై కప్పిన పుష్యరాగము
ఏలేటి శ్రీ వేంకటాద్రి ఇంద్రనీలము
పాల జలనిధిలోన పాయని దివ్యరత్నము
బాలుని వలె తిరిగీ పద్మనాభుడు॥ ॥ ముద్దు ॥